అదిరిపోయే క్లైమాక్స్

మహేష్‌బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'గుంటూరు కారం' చిత్రం సంక్రాంతి కానుకగా ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. తమన్ స్వరపరచిన ఈ సినిమా గీతాలకు అద్భుతమైన ఆదరణ లభిస్తున్నది. ఇటీవల విడుదలైన 'కుర్చీ మడతపెట్టి..' పాట పర్‌ఫెక్ట్ మాస్ నంబర్‌గా ఆకట్టుకుంది. విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో ఈ సినిమాకు సంబంధించిన లేటెస్ట్ అప్‌డేట్ కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత నాగవంశీ..మహేష్‌బాబు అభిమానులతో ట్విట్టర్ వేదికగా ముచ్చటించారు. ఈ నెల 6వ తేదీన థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. మహేష్‌బాబుతో ఎప్పటి నుంచో సినిమా చేయాలనుకుంటున్నానని..'గుంటూరు కారం'తో అది నెరవేరిందన్నారు. 'సంక్రాంతికి ఇంటిల్లిపాది ఎంజాయ్ చేసే సినిమా ఇది. మ్యూజిక్ మరో స్థాయిలో ఉంటుంది. అన్నింటికంటే ముఖ్యంగా చివరి 45 నిమిషాలు, క్లైమాక్స్ అదిరిపోయేలా ఉంటాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అదనపు షోల కోసం ప్రయత్నిస్తున్నాం' అన్నారు. అతడు, ఖలేజా తర్వాత మహేష్‌బాబు-త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న ఈ సినిమాపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

నా కెరీర్‌లోనే బెస్ట్ ఫిల్మ్ 'సైంధవ్'

వెంకటేష్, శైలేష్, వెంకట్ బోయనపల్లి

'న్యూఏజ్ యాక్షన్ థ్రిల్లర్ చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. ఈ సినిమాతో ఆ కోరిక తీరింది. కథ మొదలైన 15నిమిషాల్లోనే భావోద్వేగాలతో ప్రేక్షకులు సహానుభూతి చెందుతారు. నా కెరీర్‌లోనే బెస్ట్ ఫిల్మ్‌గా చెప్పొచ్చు' అన్నారు వెంకటేష్. ఆయన కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కించిన 'సైంధవ్' చిత్రం ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ట్రైలర్‌ను ఆవిష్కరించారు. కూతురే సర్వస్వంగా జీవిస్తుంటాడు తండ్రి. ఇంతలో ఆ చిన్నారికి మస్క్యులర్ అట్రోఫీ అనే అరుదైన వ్యాధి నిర్ధారణ జరుగుతుంది. వ్యాధిని నయం చేసే ఇంజక్షన్ ఖరీదు 17కోట్లు. ఈ క్రమంలో ఆ తండ్రి పడే సంఘర్షణ, ప్రత్యర్థులతో చేసే పోరాటం నేపథ్యంలో ట్రైలర్ ఆద్యంతం భావోద్వేగ ప్రధానంగా సాగింది. యాక్షన్ ఘట్టాలు రొమాంచితంగా అనిపించాయి. దర్శకుడు శైలేష్ కొలను మాట్లాడుతూ 'ట్రైలర్‌లో కథ మొత్తం చెప్పాను. ఇంత ధైర్యంగా కథ రివీల్ చేశానంటే సినిమాలోని ఉద్వేగాలు ఏ స్థాయిలో ఉంటాయో మీ ఊహకే వదిలేస్తున్నా. హాలీవుడ్ స్థాయి హంగులతో ఈ సినిమాను తెరకెక్కించాం. ఈ సంక్రాంతికి అందరిని ఎంటర్‌టైన్ చేస్తుంది' అన్నారు. వెంకటేష్ అంటే తనకు ఎంతో గౌరవం, ఇష్టమని..ఈ సినిమా ఓ విందు భోజనంలా ఉంటుందని చిత్ర నిర్మాత వెంకట్ బోయనపల్లి చెప్పారు. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, శ్రద్ధాశ్రీనాథ్, రుహానీ శర్మ, సారా తదితరులు నటించిన ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతాన్నందించారు.

అలాంటి కథలే ఎంపిక చేసుకుంటా

ప్రతి పాత్రను ఓ సవాలుగా స్వీకరించి అభిమానులను అలరించడమే తన లక్ష్యమంటున్నాడు రెబల్ స్టార్ ప్రభాస్. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకొంటూ కథలను ఎంపిక చేసుకుంటానని చెప్పారాయన. ప్రభాస్ తాజా చిత్రం 'సలార్' భారీ వసూళ్లు రాబట్టి బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించింది. ఈ సినిమాకు 'శౌర్యాంగ పర్వం' పేరుతో స్వీక్వెల్ రూపొందించబోతున్న విషయం తెలిసిందే. 'సలార్' విజయవంతమైన సందర్భంగా ప్రభాస్ మీడియాతో మాట్లాడారు. 'సలార్' సీక్వెల్, తదుపరి ప్రాజెక్టుల విశేషాలను ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ''సలార్-2' స్క్రిప్టు పూర్తయ్యింది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తాం. ఈ సీక్వెల్ కోసం నా అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని నాకు తెలుసు. మరికొన్ని రోజుల్లో ఈ ప్రాజెక్టు అప్‌డేట్స్ ఇస్తాం. నాకు విభిన్న నేపథ్య కథల్లో నటించాలని ఉంది. ప్రేక్షకుల నుంచి 'సలార్'కు వచ్చిన స్పందనే నా తర్వాతి సినిమాలకూ వస్తుందని ఆశిస్తున్నా. ప్రస్తుతం హారర్, సైన్స్ ఫిక్షన్ చిత్రాల్లో నటిస్తున్నా'' అని చెప్పారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన 'సలార్'లో యాక్షన్ సీక్వెన్స్, నేపథ్య సంగీతం ప్రేక్షకులకు కొత్త అనుభూతి కలిగించాయి.

అతని నటన అద్భుతం

గతంలో ఎప్పుడూ చూడని పర్‌ఫార్మెన్స్‌తో 'ఫైటర్' సినిమాలో మెప్పించింది బాలీవుడ్ భామ దీపికా పదుకోన్. హృతిక్‌రోషన్‌తో కలిసి నటించిన ఈ చిత్రంలో తనలోని విభిన్న నటీమణిని ఆవిష్కరించినందుకు దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్‌పై గతంలో ఈ హాట్‌గాళ్ ఓ రేంజ్‌లో ప్రశంసల వర్షం కురిపించింది. ఆయన ఆలోచనా విధానం అద్భుతం అంటూ కొనియాడింది. అతను సృష్టించిన పాత్రలు ఆడియన్స్ హృదయాల్లో స్టిక్కర్లలా అతుక్కుపోతాయ్.. వాటిని పీక్కోవాలంటే రెండుమూడు రోజులైనా పడుతుంది' అంటూ తెగ పొగిడేసింది. రషెస్ చూస్తున్నప్పుడే గూజ్‌బంప్స్ వచ్చాయి. హాలీవుడ్ సినిమా చూస్తున్న అనుభూతి' కలిగిందని చెప్పుకొచ్చింది కూడా. తన మనసుకు హత్తుకునే యాక్టింగ్, డైరెక్షన్, పాత్రల చిత్రీకరణపై తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పే ఈ బాలీవుడ్ భామ తాజాగా ఓ అమెరికన్ నటుడి ప్రదర్శనకు ఫిదా అయింది. అమెరికన్ నటుడు బ్రాడ్లీ కూపర్ 'మాస్ట్రో' చిత్రంలో లియోనార్డ్ బెర్న్‌స్టైయిన్ పాత్ర పోషించిన విషయం విదితమే. ఈ పాత్రలో ఆయన పర్‌ఫార్మెన్స్ అద్భుతమంటూ దీపికా ప్రశంసల వర్షం కురిపించింది. ఇది గొప్ప ప్రదర్శనల్లో ఒకటిగా ఆమె అభివర్ణించింది. ఇదే విషయాన్ని తన అభిమానులతో పంచుకునేందుకు తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో 'మాస్ట్రో' చిత్రంలోని క్లిప్‌ను షేర్ చేసింది ఈ బాలీవుడ్ స్టార్.



బరిలో దిగిన టైసన్ నాయుడు

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కథానాయకుడిగా సాగర్ కె చంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రానికి 'టైసన్ నాయుడు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 14రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. బుధవారం హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ జన్మదినం సందర్భంగా టైటిల్ ప్రకటనతో పాటు ఫస్ట్‌గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో హీరో సాయిశ్రీనివాస్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పరిచయమయ్యారు. బాక్సింగ్ రింగ్‌లో ప్రత్యర్థిని మట్టికరిపిస్తూ యాక్షన్ మోడ్‌లో కనిపించారు. బ్యాక్‌గ్రౌండ్‌లో బాక్సింగ్ దిగ్గజం మైక్ టైసన్ ఫొటో ప్రధానాకర్షణగా నిలిచింది. ఈ సినిమాలో బెల్లంకొండ శ్రీనివాస్‌ను పూర్తి యాక్షన్ అవతారంలో చూస్తారని, సాంకేతికంగా అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: ముఖేష్ జ్ఞానేష్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, రచన-దర్శకత్వం: సాగర్ కె చంద్ర.

యాక్షన్ భీమా

మాచో స్టార్ గోపీచంద్ హీరోగా తెరకెక్కుతున్న యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమా'. ప్రముఖ కన్నడ దర్శకుడు ఏ హర్ష ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా, శ్రీసత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రంలోని పలు పోస్టర్లు గోపీచంద్‌ను యాక్షన్ ప్యాక్డ్ అవతార్‌లో ప్రజెంట్ చేశాయి. మూవీ మేకర్స్ బుధవారం టీజర్ అప్‌డేట్ ఇచ్చారు. 'భీమా' టీజర్‌ను ఈ నెల 5న విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. టీజర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో గోపీచంద్ చైర్‌లో కూర్చున్న లుక్ ఇంటెన్స్‌గా ఉంది. ఈ సినిమాలో గోపీచంద్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తుండగా, ఆయన సరసన ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'సలార్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు కెమెరా: స్వామి జే, నిర్మాత: కేకే రాధామోహన్, దర్శకత్వం: ఏ హర్ష.

'భీమా'లో గోపీచంద్

షారుఖ్, చిరుతో సినిమాలు చేస్తా

రణబీర్ కపూర్ హీరోగా నటించిన 'యానిమల్' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ సినిమా అపూర్వ విజయంతో రెట్టించిన ఉత్సాహంతో దూసుకుపోతున్నారు దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా. ఈ నేపథ్యంలో ఆయన అగ్ర నటులు చిరంజీవి, షారుఖ్‌ఖాన్‌లతో సినిమాలు చేయాలనుందనే అభిలాషను వ్యక్తం చేశారు. 'అర్జున్ రెడ్డి' 'యానిమల్', 'కబీర్ సింగ్' సినిమాల ద్వారా తిరుగులేని గుర్తింపును సంపాదించుకున్న సందీప్‌రెడ్డి ఓ ఇంటర్వ్యూలో ఈ ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. సూపర్ స్టార్ షారూఖ్ ఖాన్, మెగాస్టార్ చిరంజీవితో భవిష్యత్తులో సినిమాలు చేసే ఆలోచన ఉందని తెలిపారు. త్వరలో ఆయన ప్రభాస్‌తో 'స్పిరిట్' సినిమాకు సన్నద్ధమవుతున్నారు. ఆ తర్వాత అల్లు అర్జున్ హీరోగా ఓ భారీ సినిమా చేయనున్నారు.

1980నాటి ప్రేమకథ

అగ్ర నటుడు నాగార్జున కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'నా సామిరంగా'. విజయ్ బిన్ని దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్స్ పతాకంపై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో అల్లరి నరేష్, రాజ్ తరుణ్ కీలక పాత్రలను పోషిస్తున్నారు. ఈ సినిమాలో భాస్కర్‌గా రాజ్‌తరుణ్ పాత్రను పరిచయం చేస్తూ గ్లింప్స్ విడుదల చేశారు. ఇందులో రాజ్‌తరుణ్, రుక్సార్ థిల్లాన్ జోడీ ఆకర్షణీయంగా కనిపించారు. 1980 నేపథ్యంలో వారిద్దరి ప్రేమకథను అందంగా ఆవిష్కరించారు. కాలేజీ నేపథ్యంలో చిత్రీకరించిన సన్నివేశాలు, విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. స్నేహం, ప్రేమకథ, భావోద్వేగాలు కలబోసిన కథాంశమిదని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: శివేంద్ర దాశరథి, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, దర్శకత్వం: విజయ్ బిన్ని.

రాజ్‌తరుణ్, రుక్సార్ థిల్లాన్

అనుకోని మలుపుల జీవితం..

గత నవంబర్ నెలలో యువ హీరో వరుణ్‌తేజ్‌తో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టింది లావణ్య త్రిపాఠి. ఈ జంట వివాహం ఇటలీలో వైభవంగా జరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ నవ దంపతులు తమ కెరీర్‌పై దృష్టి పెడుతున్నారు. వరుణ్‌తేజ్ 'ఆపరేషన్ వాలెంటైన్' సినిమాతో బిజీగా ఉండగా.. లావణ్య త్రిపాఠి 'మిస్ పర్ఫెక్ట్' వెబ్‌సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకురానుంది. విశ్వక్ ఖండేరావ్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. బుధవారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'మన జీవితాల్లో అనుకోకుండా ఏర్పడే కొన్ని బంధాలు ఎలాంటి మలుపులకు కారణమవుతాయనే కాన్సెప్ట్‌తో ఈ సిరీస్‌ను తెరకెక్కించాం. ఆద్యంతం వినోదప్రధానంగా ఉంటుంది. అన్ని వర్గాల వారు కనెక్ట్ అవుతారు' అని చెప్పారు. అభిజీత్ దుద్దాల, అభిజ్ఞ ఉతలూరు, ఝాన్సీ, హర్షవర్ధన్ తదితరులు నటిస్తున్న ఈ సిరీస్‌కు కెమెరా: ఆదిత్య జవ్వాది, సంగీతం: ప్రశాంత్ ఆర్ విహారి, దర్శకుడు: విశ్వక్ ఖండేరావ్.

తెలుగులో లేడీ ఓరియెంటెడ్ చిత్రం

దక్షిణాది అగ్ర కథానాయికల్లో ఒకరిగా కొనసాగుతున్నది నయనతార. అభిమానులు ఆమెను లేడీ సూపర్‌స్టార్ అని అభివర్ణిస్తారు. గత కొన్నేళ్లుగా మహిళా ప్రధాన చిత్రాల ద్వారా తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకుందీ భామ. దక్షిణాదిన అత్యధిక పారితోషికం అందుకుంటున్న కథానాయిక నయనతారే కావడం విశేషం. ఈ నేపథ్యంలో ఈ భామ తెలుగులో ఓ లేడీ ఓరియెంటెడ్ చిత్రాన్ని చేయబోతున్నట్లు తెలిసింది. అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నట్లు సమాచారం. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కించబోతున్న ఈ సినిమా కోసం నయనతారకు భారీ పారితోషికాన్ని ఆఫర్ చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. కథలోని కొత్తదనం నచ్చడంతో నయనతార కూడా ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తిగా ఉందని చెబుతున్నారు. అయితే ఈ వార్తల్లో నిజమెంతో తెలియాలంటే అధికారిక ప్రకటన రావాల్సిందే అంటున్నారు. ప్రస్తుతం నయనతార తమిళంలో వరుస సినిమాలతో బిజీగా ఉంది.

యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుంది

శివ కంఠమనేని, నందితాశ్వేత ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రాఘవ రెడ్డి'. సంజీమ్ మేగోటి దర్శకుడు. లైట్ హౌస్ సినీ మ్యూజిక్ సంస్థ నిర్మించింది. ఈ నెల 5న విడుదలకానుంది. మంగళవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉంటాయి. క్రిమినాలజీ ప్రొఫెసర్‌గా శివ కంఠమనేని చక్కటి నటనను ప్రదర్శించారు. ఆయన పాత్ర గుర్తుండిపోతుంది' అన్నారు. శివ కంఠమనేని మాట్లాడుతూ 'నటుడిగా నన్ను కొత్త పంథాలో ఆవిష్కరించే చిత్రమిది. యాక్షన్ ఘట్టాలు ఆకట్టుకుంటాయి. సందేశంతో కూడా మెప్పిస్తుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

హరి క్రియేషన్స్ ప్రొడక్షన్ నెంబర్ వన్ షురూ



ప్రణం దేవరాజ్ ప్రధాన పాత్రలో ఓ పూర్తి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ రూపొందుతున్నది. శంకర్ దర్శకత్వంలో పి.హరికృష్ణగౌడ్ దీన్ని నిర్మిస్తున్నారు. హరి క్రియేషన్స్ ప్రొడక్షన్ నెంబర్ 1గా తెలుగు, కన్నడ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కనున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఆకాశ్ పూరి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టగా, దేవరాజ్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తనికెళ్ల భరణి మేకర్స్‌కి స్క్రిప్ట్ అందించడం ద్వారా తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు శంకర్ మాట్లాడుతూ 'ఇది నా మొదటి సినిమా. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఉండే ఈ సినిమా మొదటి షెడ్యూల్ జనవరి మూడో వారం నుంచి హైదరాబాద్, తర్వాత వైజాగ్ పరిసర ప్రాంతాల్లో నిర్విరామంగా జరుగుతుంది'. అని చెప్పారు. తమ ఈ మొదటి ప్రొడక్షన్‌ను ఆశీర్వదించిన అందరికీ కృతజ్ఞతలు అని నిర్మాతలు అన్నారు. శేఖర్ చంద్ర మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రం నటీనటులు: ప్రణం దేవరాజ్, సుమన్, రవి శివతేజ; రచన దర్శకత్వం: శంకర్; నిర్మాత: పి.హరికృష్ణగౌడ్; డీపీవో: బాలసరస్వతి.